క్లుప్తంగా

క్షయ వ్యాధితో జాగ్రత్తగా ఉండాలి



మరికల్: క్షయ వ్యాధి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ట్రయినీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పూసల్‌పహాడ్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం టీబీ వ్యాధిపై హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితులకు టీబీ పరీక్షలు చేశారు. టీబీ ప్రమాదకరమైన వ్యాధి కావడంతో రెగ్యులర్‌గా మందులు వాడితే వ్యాధి తగ్గిపోతుందన్నారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు తప్పదన్నారు. కార్యక్రమంలో ఆశాలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మక్తల్: నిరుపేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం మక్తల్ తహసీల్దార్ సతీశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు దాదాపు రూ. 8,600 కోట్లు వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు బాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్, గోపి, అంబ్రేస్, నవీన్, గణేశ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హజ్రత్ షా ఉర్సు



నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక సరాఫ్ బజార్‌లోని మదినా మజీద్‌లో హజ్రత్ షా సిద్భతుల్ల ఖాద్రి రహమతుల్లా అలై ఉర్సు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉర్సులో భాగంగా రాత్రి 9 గంటలకు బయలుదేరి తెల్లవారు జామున ఉదయం 2.00 గంటలకు గంధం చేరకుంది. కార్యక్రమంలో దర్గా పీఠాధిపతి హజ్రత్ సయ్యద్ షా ఆల్ హజ్ మహబూబ్ ఖాద్రి, సయ్యద్ అసిఫ్ ఖాద్రి, సయ్యద్ యూనుస్ ఖాద్రి, సయ్యద్ యాసిన్ ఖాద్రి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు ఏర్పాటు



కృష్ణా: రాష్ట్రం నుంచి కర్ణాటకకు యూరియాను అక్రమంగా తరలించకుండా సరిహద్దులో పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ ఎండీ నవీద్ తెలిపారు. గురువారం కృష్ణా చెక్‌పోస్టును తహసీల్దార్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉమ్మడి మండలాల్లోని రైతుల పేరుపై కొందరు అక్రమార్కులు యూరియాను కర్ణాటకకు తరలిస్తున్నట్లు తమకు సమాచారం రావడంతో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్‌పోస్టులో అనునిత్యం వాహనాల తనిఖీ చేపడతామి, అలాగే ఉమ్మడి మండల రైతులకు యూరియా కొరత లేకుండ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



నర్వ: మండలంలోని సీపూర్ గ్రామంలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడలిలో రుత్వికుల వేద మంత్రోచ్ఛరణల మధ్య బొడ్రాయిలను ప్రతిష్ఠించారు. అనంతరం ఆంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అఖండ హరినామ సంకీర్తనలు

ధన్వాడ: మండలంలోని గున్ముక్ల గ్రామానికి చెందిన కడప రాయభజన మండలి సభ్యులు తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది పంటలు బాగా పండి రైతులు సిరిసంపదలతో సంతోషంగా ఉండాలని దేవుడిని వేడుకున్నట్లు వారు తెలిపారు. కృష్ణయ్య, నాగార్జున పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి ప్రతీక.. అడవి ఖానాపూర్



మాగనూర్ మండలంలోని అడవి ఖానాపూర్ గ్రామం

- తమ గ్రామాన్ని కృష్ణా మండలంలో కలపాలని విజ్ఞప్తి
- ఎన్నికల వేళ ఇబ్బందులు తప్పవని ఆందోళన

కృష్ణా: మండలంలోని చేగుంట గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన 'అడవి ఖానాపూర్' అధికారుల నిర్లక్ష్యానికి ప్రతీకగా నిలుస్తుంది. 2016లో జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా మాగనూర్ మండలాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అడవి ఖానాపూర్ గ్రామాన్ని కృష్ణా మండలంలో కాకుండా మాగనూర్ మండలంలో కలిపారు. కృష్ణా మండలంలో గతంలో ఉన్న 18 గ్రామ పంచాయతీలలో 9 గ్రామ పంచాయతీలను కృష్ణా మండలానికి కేటాయించగా మిగితా 9 గ్రామ పంచాయతీలు మాగనూర్ మండలానికి కేటాయించారు. ఆ తరువాత మళ్లీ ఈ మండలంలో నాలుగు గ్రామ పంచాయతీలు కొత్తగా ఏర్పడగా చేగుంట గ్రామ పంచాయతీని మాత్రమే కృష్ణా మండలంలో ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. అయితే దాని అనుబంధ గ్రామమైన అడవి ఖానాపూర్ మాత్రం ఈ మండలంలో ఉన్నట్లు రికార్డులో నమోదు చేయలేదు. ఈ విషయంపై ఆ గ్రామ ప్రజలు కొంత కాలంగా తమ సమస్యను పరిష్కరించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

మంత్రి చొరవ చూపాలి

అడవి ఖానాపూర్‌లో 300 జనాభాతో 210 మంది ఓటర్లు ఉన్నారు. కాగా ఈ గ్రామానికి చెందిన విద్యార్థులు ఉన్నత చదువుల కోసం స్థానిక, కుల, ఆదాయ ధృవీకరణపత్రాల కోసం కృష్ణా మండలానికి కాకుండా మాగనూర్ మండలానికి వెళ్లాల్సి వస్తుంది. ప్రస్తుతం విద్యార్థుల సర్టిఫికెట్స్‌కు, అలాగే వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని గ్రామ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. తమ గ్రామ పంచాయతీ కృష్ణా మండలంలో ఉంటే గ్రామం మాత్రం మాగనూర్ మండలంలో ఉండడం సరికాదని, అడవి ఖానాపూర్ గ్రామాన్ని కూడా కృష్ణా మండలంలో కొనసాగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం వాకిటి శ్రీహరి మంత్రిగా బాధ్యతలు తీసుకోవడం వల్ల మంత్రి చొరవ చూపి తమ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కాలయాపన చేస్తున్నారు..

కృష్ణా మండలం ఏర్పడి ఇప్పటికి తొమ్మిదేళ్లు అవుతుంది. అప్పటి నుంచి తమకు ప్రతి విషయంలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ విషయంపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా కాలయాపన చేస్తున్నారే కానీ తమ గ్రామాన్ని కృష్ణా మండలంలో కలపడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

–కీరప్ప, అడవి ఖానాపూర్ గ్రామం

ప్రతి విషయంలో ఇబ్బందులు..

తమ గ్రామం మాగనూర్ మండలంలో కలపడం మూలంగా ప్రతి చిన్న పనికి మాగనూర్‌కు, మళ్లీ కృష్ణాకు వెళ్లాల్సి వస్తుంది. అలాగే విద్యార్థుల ధృవపత్రాలకు, భూములు కొనుగోలు, విక్రయాలు జరిపే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని అడవి ఖానాపూర్‌ను కృష్ణాలో కలపాలి.

–అంబ్రేష్‌గౌడ, అడవి ఖానాపూర్

రైతులకు నష్టపరిహారం చెల్లించండి



డీఏఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నారాయణపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జిల్లాలో సాగుచేసిన పత్తి, కంది, పెసర, మినుము, జొన్న, ఆముదం పంటలు నీట మునిగి రైతులకు నష్టం వాటిల్లిందని, కావునా రైతులను ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం డీఏఓ జాన్‌సుధాకర్‌కు వినతి పత్రం అందజేశారు. పత్తి పంటకు కలుపులు, ఎరువులు, మందులు పిచికారీ చేసిన రైతులు పెద్ద మొత్తంలో ఖర్చు చేశారని, నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ, జిల్లా కార్యదర్శి అనంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పెసర రైతులకు తీవ్ర నష్టం

దామరగిద్ద: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కోతకొచ్చిన పెసర పంట పాడవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. మండలంలోని లింగారెడ్డిపల్లి, కండెన్‌పల్లి, ఉడ్మల్‌గిద్ద, దామరగిద్ద తదితర గ్రామాల్లో పెసర సాగు చేపట్టారు. పంట చేతికందే సమయానికి వర్షాలు కురవడంతో పంట నల్లబడి మొలకెత్తింది. దీంతో గిట్టుబాటు ధర అందక నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి



బురదలో ఇబ్బందులు పడుతున్న బాటసారులు

నారాయణపేట రూరల్: మండలంలోని అప్పక్‌పల్లి నుంచి కోటకొండ వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ఈ మార్గంలో ఉన్న సింగల్ రోడ్డును కోయిలకొండ వరకు డబుల్ రోడ్డుగా మంజూరు చేయించారు. అయితే పనులు మధ్యలో నిలిచిపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అమ్మిరెడ్డి పల్లి నుంచి బొమ్మన్ పాడ్ గేట్ వరకు నాలుగు కిలోమీటర్లు బీటీ రోడ్డు వేయకుండా వదిలేయడంతో ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటేనే జంకుతున్నారు. ఇటీవల వర్షాలకు ఈ రోడ్డంతా బురదమయంగా మారడంతో నరక యాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిలిచిపోయిన రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని కోరుతున్నారు.

బ్యాంకు సేవలు పునరుద్ధరించాలి



మక్తల్: పట్టణంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో సేవలు దాదాపు వారం నుంచి నిలిచిపోయాయి. కరెంటు లేకపోవడం, బ్యాటరీలు పని చేయకపోవడం వంటి సమస్యలతో గురువారం కూడా సేవలు నిలిచిపోయాయి. దీంతో వినియోగదారులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం నుంచి బ్యాంకు సేవలు సక్రమంగా పని చేయడం లేదని, ఉన్నత అధికారులు స్పందించి బ్యాంకు సేవలను త్వరితగతిన పునరుద్ధరించాలని ఖాతాదారులు కోరుతున్నారు.

వ్యవసాయ కూలీలకు సాయమందించాలి

ఊట్కూరు: వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో రూ.12వేలు సాయమందించాలని ఏఐపీఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్కోటి చింతలప్ప కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ భూమి లేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద మొదటి విడత రూ.6 వేలు, రెండో విడత రూ.6 వేలు చెల్లించలేదని ఆరోపించారు. ఉపాధి కార్డుతో సంబంధం లేకుండా వ్యవసాయ కూలీల సమగ్ర సర్వే నిర్వహించి వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా గుర్తింపుకార్డులు ఇవ్వాలని కోరారు. అంతకు ముందు గంటపాటు తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు.కార్యక్రమంలో సిపిఐఎంఎల్ డివిజనల్ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి కనకారాయుడు, నాయకులు చంద్రశేకర్, కృష్ణ, పోలప్ప, తిమ్మయ్య, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ప్రతిభకు దక్కిన గౌరవం



కోస్గి రూరల్: గుండుమాల్ మండలంలోని బలుబద్రాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కుండెటి నరసింహకు అరుదైన గౌరవం దక్కింది. ఈయన ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రెనింగ్ ప్రచురించే మ్యాగజైన్‌లో కుండెటి నరసింహ సక్సెస్ స్టోరీని 'సమాజం మన పాఠశాలను ఎప్పుడు నమ్ముతుంది అంటే' అనే పేరుతో ప్రచురించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్వేత తెలిపారు. నరసింహ పాఠశాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు ఎందరో విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దినందుకు గాను ఈ గౌరవం దక్కినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా గురువారం ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించారు.

కృష్ణానదికి వరద ఉధృతి



కృష్ణా: కృష్ణానదిపై ఎగువన ఉన్న కర్ణాటకలోని నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి గురువారం 33 గేట్లు ఎత్తి 2.50 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలడతో పాటు భీమనదిపై ఉన్న సన్నత్తి డ్యాం నుంచి 75వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. దీంతో దాదాపు నాలుగు లక్షల క్యూసెక్కుల వరద కృష్ణానదికి పోటెత్తడంతో కృష్ణా నది ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ క్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్,ఎస్‌ఐ ఎండీ నవీద్ గురువారం నదీతీరంలోని వాసునగర్, మారుతీనగర్‌ను పరిశీలించారు. నీటి ప్రవాహం పెరగడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అందుబాటులో ఆయుర్వేద డాక్టర్

మరికల్: మండల కేంద్రంలో ఖాళీగా ఉన్న ఆయుర్వేద కేంద్రంలో వైద్యుడిగా డాక్టర్ హరీశ్ కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. కొన్నేళ్లుగా ఆయుర్వేద ఆస్పత్రిలో డాక్టర్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో అధికారులు హరీశ్‌కుమార్‌ను నియమించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ

కోస్గి రూరల్: ఎస్‌జీఎఫ్ అండర్–15 విభాగంలో రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీలలో గుండుమాల్ పియంశ్రీ ఆదర్శ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 18, 19న రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లాను మూడో స్థానంలో నిలిపారన్నారు. పోటీల్లో 33 జిల్లాలు పాల్గొనగా జిల్లాకు మూడో స్థానం లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను గురువారం అభినందించారు. కార్యక్రమంలో పిడి సాదిక్ , పిఆర్‌పి దస్తయ్య , ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

పనుల జాతరను విజయవంతం చేయాలి

ఊట్కూరు: ప్రభుత్వం చేపట్టిన పనులు జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ స్వచ్ఛభారత్ మిషన్ శాఖల ద్వారా మండలంలో 155 పనులు మంజూరు అయ్యాయి. ఈ పనులకు రూ. 46.31 లక్షలు మంజూరు అవడంతో గ్రామాల మధ్య మట్టి రోడ్లు, గొర్రెల షెడ్‌లు, పశువుల పాక, మరుగుదొడ్లు తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం గ్రామ సభను నిర్వహించి పనులను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

అమరచింత: సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను నియంత్రించవచ్చని సీఐ శివకుమార్ అన్నారు. గురవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన వీధులతో పాటు వ్యాపార సముదాయల వద్ద, చౌరస్తాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి అవసరయ్యే నిధులను సమకూర్చుకోవాలని సూచించారు. ప్రజలు తమకు తోచినంత విరాళం అందించాలని కోరారు.

నర్సింహా రెడ్డి సేవలు మరువలేనివి

నారాయణపేట రూరల్: లయన్స్ క్లబ్ మాజీ డిస్టిక్ గవర్నర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ పి.నర్సింహా రెడ్డి 77వ జయంతి వేడుకలు స్థానిక శ్రీ సాయి స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. గురువారం ఆయన చిత్రపటానికి భార్య పి.లలిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సూచించారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

అమరచింత: మండలంలోని మస్తీపూర్ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ రవికుమార్ యాదవ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశం విచ్ఛిన్నం కాకుండా పోరాడిన మహావీరుడు శివాజీ విగ్రహన్ని మస్తీపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ సభ్యులు దేవర్ల సురేష్, చెన్నంశెట్టి దామోదర్, భరత్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు



మాట్లాడుతున్న డీఎస్పీ లింగయ్య

కోస్గి రూరల్: గణేష్ ఉత్సవాలు, ఇతర మతపరమైన పండుగలలో డీజేలకు అనుమతి లేదని డీఎస్పీ లింగయ్య అన్నారు. గురువారం పట్టణంలోని పంచాక్షరి ఫంక్షన్ హాల్‌లో ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు కోస్గి, గుండుమాల్, మద్దూర్ మండలాల పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మత పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. డీజే సౌండ్ వల్ల వృద్ధులకు, రోగులకు, చిన్నారులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని సాంప్రదాయ బద్ధంగా పండగలను జరుపుకోవాలన్నారు. వినాయక మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నీటి బ్యారల్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చట్టానికి వ్యతిరేకంగా డీజేలను వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీఐ సైదులు , ఎస్సైలు బాల్‌రాజ్ , ఆంజనేయులు, విజయ్‌కుమార్ , ఉత్సవ కమిటి ప్రతినిదులు ఉన్నారు.

శాంతియుతంగా జరుపుకోవాలి

నర్వ: పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ పబ్బతి రమేష్ అన్నారు. గురువారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. మతపరమైన ప్రదేశాల వద్ద పరస్పరం గౌరవం, సహనం పాటించి ఒకరి మనోభావాలను మరొకరు గౌరవించాలన్నారు.

ఇళ్లు త్వరితగతిన నిర్మించుకోవాలి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

ధన్వాడ: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మొదటి విడత పూర్తి చేసిన పలువురు లబ్ధిదారులకు రూ.లక్ష చెక్కును ఆమె గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్చిన హామీ ప్రకారం పేదవారి సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేస్తుందన్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వం విడతల వారీగా నగదు జమ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరహరి, నాయకులు లక్ష్మయ్యగౌడ్, నరేందర్‌గౌడ్, యుసుఫ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి జయంతి వేడుకలు

నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ పర్ణికారెడ్డి తండ్రి చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి జయంతి వేడుకలను గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శివకుమార్‌రెడ్డి మండల కేంద్రంలోని కంచుకోటలో ఉన్న చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. తండ్రి ఆశయాలను నెరవేరుస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని పర్ణికారెడ్డి అన్నారు.

నిధులు విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్/నారాయణపేట రూరల్: పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైందని, ప్రభుత్వం స్పందించి స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయాలని సీపీఐ మాస్ లైన్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ సుదర్శన్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వం నుంచి నిధులు అందకపోవడంతో మురికి కాలువలు శుభ్రం చేసే పరిస్థితి కూడా లేదన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని తక్షణమే స్థానిక సంస్థలకు నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు యాదగిరి, నరసింహా, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం

మక్తల్: పారిశుద్ధ్య పనుల కోసం స్థానిక సంస్థలకు తక్షణమే నిధులు విడుదల చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ రమేశ్‌కు వినతి పత్రం అందజేశారు. పట్టణాలతో పాటు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారిందన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడిపడితే అక్కడ చెత్త పేరుకుపోయి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కిరన్, భగవంతు, వెంకట్‌రేడ్డి, కొలిమి రాములు, కళ్యాన్‌రాజు, నర్సింహ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి

మద్దూరు: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ డిమాండ్ల సాధనకు హైదరాబాద్‌లో సెప్టెంబర్ 1న చేపట్టిన మహాధర్నాకు సంబంధించిన పోస్టరును గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో లక్ష మంది ఉద్యోగ, ఉపాధ్యాయులతో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేష్‌గౌడ్, ఎంపీడీఓ రహ్మతుద్దీన్, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నర్సింహారెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు కార్యక్రమం

మాగనూర్: మండల కేంద్రంలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సభ్యత్వ నమోదు కార్యక్రమం కేజీబీవీల్లో, మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా పీఆర్‌టీయూ జనార్దన్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పింఛన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్‌సీ హెల్త్ స్కీంను త్వరగా అమలు చేయాలని కోరారు.

ముమ్మరంగా వంతెన నిర్మాణ పనులు



నిడ్జింత వాగుపై కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

కొత్తపల్లి: మండలంలో వంతెన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మద్దూరు నుంచి మహబూబ్ నగర్‌కు నిర్మాణ పనులు చేపట్టారు. రహదారి నిర్మాణంలో భాగంగా నిడ్జింత సమీపంలోని వాగులో వంతెన పనులు పిల్లర్ల దశను పూర్తి చేసి స్లాబ్ పనులు చేసే సమయంలో వర్షాలు కురవడంతో తాత్కాలిక వంతెన ఏర్పాటు చేశారు. భారీ వర్షాలకు తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. ప్రస్తుతం వర్షాలు ఆగిపోవడంతో సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి గురువారం వంతెనపై స్లాబ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. నెల రోజుల్లో మిగిలిన పనులు పూర్తయ్యే అవకాశం ఉందని ఆర్ అండ్ బీ డీఈ రాములు తెలిపారు. అలాగే కొత్తపల్లి–బూనీడు మధ్యలో వాగుపై నిర్మించే బ్రిడ్జి పనులు నత్తనడకన కొసాగుతున్నాయి. వంతెన సమీపంలోతాత్కాలిక వంతెన గత 10 రోజుల క్రితం భారీ వర్షాలకు వచ్చిన వరదలకు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి 10 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావడానికి దాదాపు 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాత్కాలిక వంతెనను కొంత ఎత్తు పెంచి రాకపోకలు కొనసాగేలా చూడాలని కోరుతున్నారు.

కేంద్రం నిర్లక్ష్యంతోనే యూరియా కొరత



పీఏసీఎస్ వద్ద మాట్లాడుతున్న వ్యవసాయ సంఘం నాయకులు

ఆత్మకూర్: కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే రాష్ట్రానికి పూర్తిస్థాయిలో యూరియా రావడం లేదని ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని తెలంగాణ చెరుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గోపి అన్నారు. గురువారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతులు ఉదయం ఐదుగంటల నుంచి యూరియా కోసం అన్నదాతలు నిరీక్షిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ పడరాని పాట్లు పడుతున్నారని, తెల్లవార్లు పడిగాపులు కాస్తున్నారన్నారు. రైతులకు సరిపడా యూరియా తెప్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులు క్యూలో నిల్చొంటే యూరియా లేదంటూ బోర్డు పెట్టి వెళ్లిపోండి అంటు చెప్పడం ఏమిటని రైతులంటే అలుసుగా ఉందా అంటు ప్రశ్నించారు. రైతులకు, పీఏసీఎస్ సిబ్బంది, వ్యవసాయశాఖ అధికారులమధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటు చేసుకోవడంతో సీఐ శివకుమార్ ఇక్కడికి చేరుకుని నచ్చజెప్పారు. క్యూలో నిల్చున్న రైతులందరికీ టోకెన్లు జారి చేస్తామని శుక్రవారం టోకెన్లు పొందిన రైతులకు యూరియా అందిస్తామని చెప్పడంతో నాయకులు, రైతులు శాంతించారు. కార్యక్రమంలో రెతుసంఘం నాయకులు పాల్గొన్నారు.